క్లుప్తంగా

ఫుట్‌పాత్‌పై చెత్త తొలగింపు



చెత్త తొలగించడంతో శుభ్రంగా ఫుట్‌పాత్

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: ఫుట్‌పాత్‌పై పది రోజులుగా చెత్త పేరుకుపోయినా తొలగించక పోవడంపై బుధవారం 'పేరుకుపోతున్న చెత్త' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. 20వ వార్డు పెదవాల్తేరు, చిన్నవాల్తేరు, కరకచెట్టు పోలమాంబ ఆలయ మార్గంలోని ఫుట్‌పాత్‌పై పేరుకుపోయిన చెత్తను తొలగించారు. దీంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వక్తం చేశారు.

కలెక్టర్ దృష్టికి అతిథి అధ్యాపకుల సమస్యలు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న అతిథి అధ్యాపకులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలపై బుధవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఏయూ అతిథి అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నెలవారి జీతాలు, రూల్స్‌కు వ్యతిరేకంగా యూనివర్సిటీలో నియమించిన టీచింగ్ సభ్యులందరినీ పంపించాలని, దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ యూనివర్సిటీలో అమలు జరిగేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. మహిళలకు నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లను గుర్తించే విధంగా చూడాలని విన్నవించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లుగా అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఎం.సురేష్ మీనన్ తెలిపారు. డాక్టర్ దాస్, డాక్టర్ శిరీష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షణ

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్–10లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. అప్పుఘర్ రోడ్, ఎంవీపీ డబుల్ రోడ్లను కలుపుతూ ఈ నిర్మాణం జరగనుంది. భాష్యం స్కూల్ జంక్షన్ నుంచి ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్ మీదుగా ఎంవీపీ సర్కిల్ రోడ్డును కలిపే మార్గంలో కూడా రోడ్లు నిర్మిస్తున్నారు. ఇటీవల ప్రకటించిన టెండర్లలో భాగంగా సెక్టార్–1, సెక్టార్–3ల్లో పలు రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులను బుధవారం జోన్–3 ఇంజినీరింగ్ విభాగం ఏఈ అప్పలనాయుడు, సిబ్బంది పర్యవేక్షించారు.

ఎండీఎం నిర్వాహకులకు వంటల పోటీలు



వంటకాలను పరిశీలిస్తున్న ఎంఈవో అనురాధ

ఆరిలోవ: చినగదిలి మండలం పాఠశాలల్లోని ఎండీఎం నిర్వాహకులకు బుధవారం తోటగరువు ప్రాథమిక పాఠశాలలో వంటలు పోటీలు నిర్వహించారు. మండలంలోని 12 ప్రాథమిక పాఠశాలల ఎండీఎం నిర్వాహకులు పాల్గొని తమ వంటల రుచి చూపించారు. వారు వండి ప్రదర్శించిన వంటకాలను ఎంఈవో పి.అనురాధ పరిశీలించారు. వెజ్ పలావ్, ఉడికించిన గుడ్లు, బంగాళదుంపల కుర్మా తదితర వంటకాలను ఆమె రుచి చూసి బహుమతులు అందజేశారు. రుచికరమైన వంటలు వండిన మధురవాడ ప్రాంతం సునీల్‌శర్మ కాలనీ పాఠశాలకు మొదటి బహుమతి, ఆరిలోవ కాలనీ పాఠశాలకు రెండో బహుమతిని ఎంఈవో అందించారు.

సూర్యోదయం.. తేజోమయం



తెన్నేటి పార్క్ సాగర తీరంలో బుధవారం ఉదయం కనిపించిన సూర్యోదయ సుందర దృశ్యం చూపురులను ఎంతో ఆకట్టుకుంది.
- ఏయూక్యాంపస్



20వ వార్డు నుంచి ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ ముర్వల లక్ష్మి సురేష్, పార్టీ శ్రేణులు



22వ వార్డు నుంచి బయలదేరిన పార్టీ నాయకులు



11వ వార్డులో పార్టీ నాయకుల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మేయర్ హరివెంకటకుమారి

- హామీలు విస్మరించిన ముఖ్యమంత్రికి పాలించే అర్హత లేదు
- కూటమి ఏడాది అసమర్థ పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యం
- వైఎస్సార్‌సీపీ 'తూర్పు' సమన్వయకర్త మొల్లి అప్పారావు
- వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వెల్లువెత్తిన జనం
- **'తూర్పు' నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ నాయకులు, కార్యకర్తలు**

నయవంచనే చంద్రబాబు నైజం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా ఎన్నికల హామీలు నెరవేర్చకుండా.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా పాలకులు ప్రజలను మోసం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతల నయవంచనకు నిరసనగా.. **ప్రజలకు మద్దతుగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు.**

తూర్పులోని అన్ని వార్డుల నుంచి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి ఆటోలు, ద్విచక్ర వాహనాలతో వైఎస్సార్‌సీపీ జెండాలు పట్టుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినాదాలు చేస్తూ కలెక్టరేట్ వద్దకు వెళ్లారు. అక్కడ నిరసన తెలియజేసి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



13వ వార్డు నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు నేతృత్వంలో నియోజకవర్గంలోని 15 వార్డుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా కలెక్టరేట్‌కు తరలివెళ్లి వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. అధికారం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో బూటకపు హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని, నయవంచనే ఆయన నైజమని మొల్లి అప్పారావు ధ్వజమెత్తారు.

9, 10, 11, 12, 13 వార్డుల నుంచి..

జీవీఎంసీ 9వ వార్డు నుంచి కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు జోడుగుళ్లపాలెం, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఉమ్మడి దాస్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

➡ 10వ వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ఆదర్శనగర్, డెయిరీ ఫారం, హనుమంతవాక, వెంకోజీపాలెం, పెదవాల్తేరు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పతివాడ కనకరాజు, వైదా నారాయణరావు, కె.ఆర్.పాత్రుడు, పతివాడ వెంటకలక్ష్మి, కె.గోవింద్, వరలక్ష్మి, కె.కృష్ణ, నాగేశ్వరరావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

➡ 11వ వార్డు పెదగదిలి వద్ద ర్యాలీని మాజీ మేయర్, కార్పొరేటర్ గొలగాని హరివెంకటకుమారి జెండా ఊపి ప్రారంభించారు. ఆటోలు, కార్లు, బైక్‌ల్లో బయలుదేరి పెదగదిలి, హనుమంతవాక, వెంకోజీపాలెం, పెదవాల్తేరు మీదుగా కలెక్టరేట్‌కు వెళ్లారు. పార్టీ నాయకులు గొలగాని శ్రీనివాస్, కొల్లి అప్పారావు, మక్బుల్, షకీనా, విజయ తదితరులు పాల్గొన్నారు.

➡ 12వ వార్డు చినగదిలి నుంచి నాయకులు, కార్యకర్తలు ఆటోలు, బైక్‌ల్లో బయలుదేరారు. ర్యాలీలో అల్లంపల్లి రాజబాబు, చొక్కెర శేఖర్, మోహన్, శ్రీనివాస్, అర్జున్, వరహాలు, సంతోష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామ్‌నగర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న 28వ వార్డు నాయకులు

➡ 13వ వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బయలుదేరారు. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలతో కలసి ర్యాలీగా బయలుదేరి టీఐసీ పాయింట్, అంబేడ్కర్ కూడలి, చినగదిలి, హనుమంతవాక, వెంకోజీపాలెం, పెదవాల్తేరు మీదుగా కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. నాయకులు సత్యాల వెంకట్, జి.విక్టర్, వాసు, సత్యాల సాగరిక, కె.శిరీషా, వనం వరలక్ష్మి, గోవింద్, బాబూరావు, వెంకటరెడ్డి, శ్రీనివాస్, పోలారావు, భాస్కర్, దుర్గారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

20, 22, 28 వార్డుల నుంచి..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబ దేవాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లారు.

➡ వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు.

➡ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రామ్‌నగర్ నుంచి ర్యాలీగా వెళ్లారు.

భారీ ర్యాలీగా తరలిన దళితులు

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి దళితులు తరలివెళ్లారు. రామ్‌నగర్ నుంచి సిరిపురం సర్కిల్ మీదుగా భారీ ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి వెన్నుపోటుపై దారి పొడవునా నినాదాలు చేశారు.



బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్తున్న దళితులు

17వ వార్డు నుంచి..

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ 17వ వార్డు నాయకుల ఆధ్వర్యంలో కాగితాల వారి వీధి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేక పోయిందని ఎద్దేవా చేశారు. అనంతరం ర్యాలీగా సిరిపురం కూడలికి చేరుకుని అక్కడి నుంచి జిల్లా, నియోజకవర్గ నాయకులతో కలిసి కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. పార్టీ నాయకులు నీలారెడ్డి, రంగాల శివ, నందూరి సుబ్రహ్మణ్యం, కుమార్‌రెడ్డి, దుంప రవికుమార్, సత్యవతి, జోషిలా, లవణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డులో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దగాకోరు ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

మద్దిలపాలెం: కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనకు నిరసనగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి నియోజకవర్గంలోని 15 వార్డుల నుంచి పార్టీ శ్రేణులతోపాటు జనం భారీగా తరలివచ్చారని పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు తెలిపారు. అన్ని వార్డుల నుంచి అత్యధిక సంఖ్యలో జనం, కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు చెప్పారు. హామీలను విస్మరించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పాలించే అర్హత లేదని, దగాకోరు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమ్మిడి స్వాతి, మొల్లి లక్ష్మి, మువ్వల లక్ష్మి, పల్లా అప్పలకొండ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా నాయకులు నడింపల్లి కృష్ణంరాజు, గొలగాని శ్రీనివాస్, పేర్ల విజయ్‌చందర్, ఉమ్మిడి దాసు, పీతల గోవింద్, రామన్న పాత్రుడు, అల్లంపల్లి రాజబాబు, బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, సూర్యనారాయణరెడ్డి, పోలిరెడ్డి, నీలారెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, సూరాడ దాసు, గణేష్, మదుపాడ రవి, బోస రమణరెడ్డి, సుబ్రహ్మ ణ్యం, సత్యవతి, జోషీలా, చొల్లంగి నాగేశ్వరరావు, బోండ ఉమామహేశ్వరరావు, శిరీష, పోలరత్నం, ఇమంది సత్యనారా యణ, బెవర జగదీశ్, జాన్ విక్టర్, వాసు, పతివాడ కనకరాజు, వెంకటలక్ష్మి, కన్నబాబు, వైదా నారాయణరావు, సకీనా, యనమరెడ్డి కుమార్‌రెడ్డి, బోండాడ వెంకటరావు, నేదురు సత్యనారాయణ, సంపంగి సురేష్, నక్కాన రాజ్‌కమల్, వాసుపల్లి యల్లాజీ, వివిధ హోదాల నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



16వ వార్డు నుంచి తరలి వెళ్తున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి

చిచ్చరపిడుగులు

కరాటే, కర్రసాము నేర్చుకుంటున్న చిన్నారులు



కరాటే సాధన చేస్తున్న చిన్నారి



కర్రసాము నేర్చుకుంటున్న బాలికలు

ఏయూక్యాంపస్: ఆధునిక కాలంలో ప్రతి వ్యక్తి శారీరక వ్యాయామంతోపాటు ఆత్మ రక్షణపై దృష్టి సారిస్తున్నాడు. అత్యవసర సమయాల్లో తమను తాము రక్షించుకునే ఆత్మరక్షణ విద్యలను సాధన చేస్తున్నారు. పలువురు చిన్నారులు కూడా సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ పొందుతూ చిచ్చరపిడుగుల్లా తమను తాము మలుచుకుంటున్నారు. నిత్యం ఉదయం రెండు గంటల సమయం వీరు కఠోర సాధనలో నిమగ్నమవుతున్నారు. మూడేళ్ల నుంచి 12 ఏళ్ల వయసు గల పిల్లలు కరాటే, కర్రసాము వంటి విద్యలు నేర్చుకుంటున్నారు. తెన్నేటి పార్క్ ఎదురుగా ఉన్న పార్కింగ్ స్థలంలో చిన్నారులు సెల్ఫ్ డిఫెన్స్ విద్యలను అభ్యసిస్తున్నారు. ముఖ్యంగా బాలికలు ఎంతో ఉత్సాహంగా వీటిని నేర్చుకుని, సాధన చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో వేరొకరిపై ఆధార పడకుండా తమను తాము రక్షించుకునే విధంగా వీరు తర్ఫీదు పొందుతున్నారు.

శృతిమించిన అభిమానం



కారుపై కూర్చుని ప్రయాణిస్తున్న ఫ్యాన్స్



బీచ్ రోడ్డులో బాణసంచా కాలుస్తూ..

ఏయూక్యాంపస్: యువత అభిమానం శృతిమించుతోంది. మంగళవారం రాత్రి జరిగిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ అనంతరం ఆర్‌సీబీ అభిమానులు బీచ్ రోడ్డులో హంగామా చేశారు. కార్లపై నిలుచుని ప్రయాణిస్తూ నినాదాలు చేయడం, రోడ్డుపై టపాసులు కాల్చడం, చొక్కాలు విప్పి డ్యాన్సులు చేయడం వంటివి స్థానికులకు ఇబ్బంది కలిగించాయి. రోడ్డు మధ్యలో వందలాది మంది యువత చేరుకుని డ్యాన్స్ చేస్తూ నానా హంగామా చేశారు. పక్కనే పోలీస్ ఔట్‌పోస్ట్, పోలీసు వాహనం ఉన్నా.. ఏమీ పట్టనట్టు వారు వ్యవహరించారు. అనుమతి లేకుండా టపాసులు కాల్చడమే కాకుండా కార్లపై నిలుచుని, సెల్‌ఫోన్‌లో వీడియోలు తీసుకుంటూ ప్రమాదకరంగా ప్రయాణించారు. కాళీమాత ఆలయం ఎదురుగా ఇదంతా జరిగింది. దేవాలయానికి సమీపంలో నిత్యం వేలాది మంది పర్యాటకులు సంచరించే ప్రాంతంలో యువత చేష్టలు కొంత ఇబ్బందికరంగా మారాయి. స్థానికులు వారు వారి కేకలకు, టపాసుల శబ్దాలతో ఇబ్బంది పడ్డారు. పోలీసులు వారిని నిలువరించక పోవడంతో కొంత అసహనం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చొక్కాలు విప్పి నృత్యాలు చేయడంతో పర్యాటకులు, మహిళలు కొంత ఇబ్బందికి గురయ్యారు. రోడ్డుపై వెళ్లే వాహన చోదకులు సైతం ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బంది పడ్డారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయోపరిమితి సడలించాలి



మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విదసం నాయకులు

ఎంవీపీకాలనీ: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు వయోపరిమితి సడలించాలని విదసం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్‌కు బుధవారం ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 5లో అభ్యర్థులకు 50 ఏళ్ల వయోపరిమితి పేర్కొన్నారన్నారు. దీని కారణంగా చాలా మంది రుణాలు పొందేందుకు అనర్హులవుతున్నారని చెప్పారు. సడలింపు దిశగా రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జాజి ఓంకార్, గుడివాడ ప్రసాద్, బూల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితం జీవనంతో మేలు



మాట్లాడుతున్న ఆచార్య రామకృష్ణారావు



ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న మాజీ వీసీ రామకృష్ణారావు, షారోన్ రాజు, ఆచార్యులు

విశాఖ విద్య: పర్యావరణ హితంగా, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా మానవ జీవన విధానం ఉండాలని కృష్ణా విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య ఎస్.రామకృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా బుధవారం ఏయూ విద్యా విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు వస్తున్నాయని, వాటిని వినియోగించడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేయడం సాధ్యపడుతుందని చెప్పారు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణానికి ఎదురవుతున్న సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఆసక్తిదాయకంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ హిత జీవనం సాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సేవ్ ఎన్విరాన్మెంట్ – బ్యాన్ ప్లాస్టిక్ అని నినదించారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ ప్లాస్టిక్‌పై యుద్ధాన్ని చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. గాలి, నీరు, నేల, ధ్వని కాలుష్యాల వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరించారు. అనంతరం ఏయూ ఆర్ట్స్ కళాశాల పరిసరాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, బీఈడీ విద్యార్థులు, బీఈడీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

'కేర్'లో 100 రోబోటిక్ మోకాలి శస్త్రచికిత్సలు



రోబోటిక్ శస్త్రచికిత్సలు చేసిన వైద్యుల బృందం

ఆరిలోవ: నగరంలోని కేర్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్‌లో 100 రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు చేసినట్లు సీవోవో మయూక్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్ వైద్య సేవల్లో రాష్ట్రంలోనే ఇది పెద్ద ముందడుగని చెప్పారు. ఆధునిక టెక్నాలజీతో మంచి అనుభవం కలిగిన వైద్యులు ఈ చికిత్సలు చేశారన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సల వల్ల రోగులకు తక్కువ నొప్పితో పాటు త్వరగా కోలుకుంటున్నారన్నారు. ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యుడు రవిచంద్ర సారథ్యంలో ప్రత్యేక బృందం శస్త్రచికిత్సలు విజయవంతగా నిర్వహించినట్లు తెలిపారు. ఇవి చేయించుకున్న రోగులు సురక్షితంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సలు చేసిన ఆర్థోపెడిక్ వైద్య బృందాన్ని అభినందించారు.